# సాక్షి ప్రకాశం

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023






**నిర్లక్ష్యం సహించం**

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. స్పందనలో అర్జీలు స్వీకరించారు.

- 8లో..



**స్కానింగ్ సెంటర్లపై పక్కా నిఘా**

స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటిస్తున్నాయా, లేదా తనిఖీ చేయాలని అధికారులను కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
32/28

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఇది గోరంతే.. చంద్రబాబు అవినీతి కొండంత ఉంది

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: చంద్రబాబు అవినీతి అంతా ఇంతా కాదని, ఇప్పుడు బయటపడింది కేవలం గోరంతేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన అవినీతి భాగోతంపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ నాయకులు చెబుతున్నట్లు బాబు అరెస్ట్ వెనుక రాజకీయ ప్రమేయం ఏమీలేదని, ఇది ప్రజా విజయమని ఆయన తెలిపారు. మేనిఫెస్టోలో పెట్టిన అంశాలపై గౌరవం లేకుండా వాటిలోనే అవినీతికి పాల్పడిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. ఆయన చేసిన తప్పిదాలు చాలా ఉన్నాయని, ఇప్పుడు బయటపడింది గోరంతేనని, ఇంకా కొండంత అవినీతి ఉందన్నారు. వాటి నుంచి ఆయన తప్పించుకోలేరని, ఇప్పటికైనా తన తప్పును తెలుసుకొని మిగిలిన కేసుల్లో అప్రూవర్‌గా మారితే శిక్షలైనా తగ్గుతాయని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ విషయంలో, అమరావతి రాజధాని పేరుతో తాత్కాలిక భవనాల నిర్మాణం, ఈ విధంగా అన్నింటిలో బాబు ముద్దాయని ఆయన తెలిపారు. నిరుద్యోగుల పొట్ట కొట్టిన చంద్రబాబుకు వారి ఉసురు తగలక తప్పదని, ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకొని పశ్చాత్తాప పడాలన్నారు. తప్పు చేసివారు తప్పించుకోలేరని, చట్టం ముందు అందరూ సమానులేనని ఆయన తెలిపారు.

### డీటీడబ్ల్యూఓగా జగన్నాథరావు



మంత్రి సురేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీటీడబ్ల్యూఓ పి.జగన్నాథరావు

ఒంగోలు సబర్బన్: డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా (డీటీడబ్ల్యూఓ) పిన్నింటి జగన్నాథరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా డీటీడబ్ల్యూఓగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు జగన్నాథరావు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఒంగోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

# గెలుపు మనదే..

- 2024లో ప్రకాశం జిల్లా క్లీన్‌స్వీప్
- అందరూ సమష్టిగా పనిచేయండి
- అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలి
- అర్హులందరికీ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లదే
- దొంగ ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- నియోజకవర్గ స్థాయిలో ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తెండి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీ, పార్టీ ఇన్‌చార్జులతో దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



కొండపి నియోజకవర్గ సమీక్షలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన బాలినేని, మాగుంట, జంకె, వరికూటి, జూపూడి, రూప్‌కుమార్ యాదవ్

ఒంగోలు:

పార్టీకి ప్రజల్లో విస్తృత ఆదరణ ఉందని, పచ్చపత్రికలు ఎంత విషం చిమ్మినా, ప్రతిపక్షాలు కుమ్మక్కై కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో గెలుపు మనదే అని వైఎస్సార్ సీపీ దక్షిణ కోస్తా జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. స్థానిక జ్యోతిప్లాజాలో సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నేడు దాదాపు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గతంలో సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఎన్ని రకాలు తిప్పలు ఉండేవో, జన్మభూమి కమిటీల ప్రాపకం పొందాల్సి ఉండేదో పోలుస్తూ నేడు సంక్షేమ పథకాలను ఎంత సులువుగా అందుకుంటున్నారో వివరించాలన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిన మార్పు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల జీవితాల్లో ఎలాంటి వెలుగులు నింపిందో తెలియజేయాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రాకతో నేడు గ్రామస్వరాజ్యం సాక్షాత్కారమైందనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారికి సైతం ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు.

**సమష్టిగా కృషిచేయాలి**

పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన 175/175 లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషిచేయాలన్నారు. జిల్లాలో కొండపి సహా అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడిద్దామని పిలుపునిచ్చారు. ఇందుకు పార్టీలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గాల్లో ఎవరికైనా, ఏదైనా సమస్య ఉంటే దానిని నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తన పరిధిలో పరిష్కారానికి కృషి చేస్తానని, లేకుంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనేది వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులే పరిశీలించాలన్నారు. వెనుకబడిన కులాల వారికి 56 కార్పొరేషన్ల ఏర్పాటు, సమాజంలోని అగ్రవర్ణాల్లోని పేదలకు సైతం ఆర్థిక సాయం అందిస్తూ అండగా ఉండడం, అన్ని కులాలకు రాజకీయంగా ఎదిగేందుకు నామినేటెడ్ పదవులు కల్పించిన విషయాన్ని కూడా ప్రజల ముందు ఉంచాలన్నారు.

**దొంగ ఓట్లపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి**

దొంగ ఓట్లకు సంబంధించి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విజయసాయి సూచించారు. కుప్పంలో చంద్రబాబు ఇన్నాళ్ల గెలుపునకు దొంగ ఓట్లు ఎంతగానో తోడ్పడ్డాయని, నేడు ఓట్ల పరిశీలనతో అది కాస్తా స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో ఇంకా రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో చంద్రబాబు అండ్ కో దొంగ ఓట్లు చేర్పించి ఉండడం, చేర్పించేందుకు యత్నిస్తూ ఉండవచ్చన్నారు. అటువంటి అక్రమాలను అరికట్టాలంటే క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. అర్హులందరికీ ఓటు లభించేలా, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశం కల్పిద్దామన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకోవడం ద్వారా మరింత వేగవంతంగా సమాచారం పొందగలుగుతామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో తెలుగుదేశం పార్టీ నేడు కోలుకునే పరిస్థితి లేదన్నారు. మనం మరింతగా దూకుడు పెంచి ప్రజల మన్ననలు పొందుదామని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. విజయసాయిరెడ్డితో విడివిడిగా సమీక్షలకు హాజరైన వారిలో మాజీమంత్రి, ఒంగోలు శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఉన్నారు. ఇక విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న తదితరులు ఉన్నారు.



విజయసాయిరెడ్డితో ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



విజయసాయిరెడ్డితో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శిద్దా రాఘవరావు, సుధీర్‌కుమార్, పక్కన బాలినేని, జూపూడి

**కొండపిలో జెండా రెపరెపలాడిద్దాం**

కొండపి నియోజకవర్గంలో ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోను వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. 2024 ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోను వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. ఇందుకు నాయకులంతా సమష్టిగా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, సామాజిక న్యాయ ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, కొండపి నియోజకవర్గ పరిశీలకులు రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వరికూటి అశోక్‌బాబు



జంకె వెంకటరెడ్డి



మద్దిశెట్టి వేణుగోపాల్



టీజేఆర్ సుధాకర్‌బాబు



కేపీ నాగార్జునరెడ్డి



అన్నా వెంకట రాంబాబు




బుర్రా మధుసూదన్‌యాదవ్



విజయసాయిరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

# బంద్ విఫలం...

- యథావిధిగా వ్యాపార సంస్థలు, స్కూళ్లు, బ్యాంకులు
- తిరిగిన ఆర్టీసీ బస్సులు
- ప్రజలు, కేడర్ నుంచి స్పందన రాకపోవడంతో ఉనికి కోసం పాట్లు
- అసహనానికి గురై పలు చోట్ల టీడీపీ మూకల దౌర్జన్యాలు
- ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల ఓవరాక్షన్
- జిల్లాలో ఒకటి, రెండు చోట్ల నలుగురైదుగురితో టైర్లు తగులబెట్టిన వైనం



యథావిధిగా తెరుచుకున్న దుకాణాలతో, కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ఒంగోలులోని గాంధీరోడ్డు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: తెలుగుదేశం పార్టీ చేపట్టిన బంద్ జిల్లాలో విఫలమైంది. బంద్ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు యథావిధిగా కొనసాగాయి. ప్రజల నుంచి, ఆ పార్టీ కేడర్ నుంచి ఎలాంటి స్పందన లేదు. ఉనికి కోసం అక్కడక్కడా పార్టీ నేతలు, ద్వితీయశ్రేణి నాయకులు మొక్కుబడిగా ఆందోళనలు చేసి మమ అనిపించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ రాష్ట్ర అధిష్ఠానం బంద్‌కు పిలుపునిచ్చింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా బంద్ చేపట్టాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌లు వేర్వేరు ప్రకటనల్లో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీంతో సోమవారం ఉదయం పట్టుమని పదిమంది కూడా లేకుండా టీడీపీ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు ఒంగోలు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు ఆపాలని ప్రయత్నించారు. రంగంలోకి దిగిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. జిల్లా కేంద్రంలో ఇక ఇంతకు మించి ఎలాంటి ఆందోళనలు, బంద్‌లు నిర్వహించలేదు. ఇక జిల్లా కేంద్రం ఒంగోలులోనే ఈ విధంగా ఉంటే జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా మారింది. జిల్లాలో ఒకటి, రెండు చోట్ల మాత్రం రోడ్ల మీద టైర్లు తగులబెట్టడం మాత్రం చేపట్టారు. అదీకూడా నలుగురు, ఐదుగురు మాత్రమే చేయడం గమనార్హం. అంతకు మించి ఎవరూ చంద్రబాబు జైలుకు పోయినా స్పందించలేదు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని నమ్మటంతోనే పార్టీ కేడర్ బంద్‌లో పాల్గొనలేదని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం, దర్శి, కంభం, కనిగిరి, పొదిలి, చీమకుర్తి, సింగరాయకొండ తదితర పట్టణాల్లో ఎక్కడా బంద్ ప్రభావం కనిపించలేదు.

**దామచర్ల ఓవరాక్షన్...**

జిల్లాలో బంద్ విఫలం కావడంతో తన ఉనికిని కాపాడుకోవడం కోసం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ ఒంగోలు నగరంలో ఓవరాక్షన్ చేశారు. జిల్లాలో సెక్షన్ 30 యాక్ట్ అమలులో ఉండడంతో దామచర్లను పోలీసులు బీకే ఎన్‌క్లేవ్‌లో తన ఇంటికే పరిమితం చేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. బంద్ ఇక లేదులే అనుకొని ఒంగోలు పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో ఇంట్లో నుంచి రెండో మార్గం గుండా బయటకు వచ్చి దొంగదారుల్లో ముంగమూరు రోడ్డుకు చేరుకున్నారు. అప్పటికప్పుడు కేడర్‌కు ఫోన్లు చేసి ముంగమూరు రోడ్డుకు రమ్మని పిలుపునిచ్చాడు. దీంతో ఒక్కసారిగా మధ్యాహ్నం తరువాత నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి ఆధ్వర్యంలోని సీఐలు పి.భక్తవత్సలరెడ్డి, వెంకటేశ్వరరావు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన దామచర్ల కొండయ్య బంకు వీధిలో ఒక ఇంట్లోకి వెళ్లి కూర్చుని హైడ్రామా సృష్టించారు. కాసేపటి తరువాత ఆయన అక్కడ నుంచి బయటకు వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్న విషయంపై ఆయనపై కేసు నమోదు చేశారు.

**దౌర్జన్యంగా షాపులు మూసివేత...**

ఒంగోలు నగరంలో టీడీపీ బంద్‌కు పెద్దగా స్పందన లేకపోవటంతో ఆ పార్టీ శ్రేణులు దౌర్జన్యాలకు దిగారు. బంద్‌ను ప్రజలు ఏమాత్రం పట్టించుకోకుండా తమ రోజువారీ కార్యక్రమాలను నిర్వహించుకుంటూ ముందుకు సాగుతున్నారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ శ్రేణులు తమ ఉనికిని చాటుకోవటానికి దౌర్జన్యాలకు తెగబడ్డారు. ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకుంటున్న ట్రంక్ రోడ్డు, గాంధీ రోడ్డుతో పాటు పలు వ్యాపార ప్రాంతాల్లో దౌర్జన్యాలకు దిగారు. బండ్లమిట్టలో ముస్లిం మైనారిటీలకు చెందిన షాపు వద్దకు వచ్చిన టీడీపీ శ్రేణులు షాపు మూయకపోవటంతో బలవంతంగా అతనిపై దౌర్జన్యం చేసి షట్టరును మూసేశారు.



ఒంగోలు బండ్లమిట్ట సెంటర్‌లో ఓ షాపు యజమానిపై దౌర్జన్యం చేసి మూయిస్తున్న టీడీపీ కార్యకర్తలు

**పోలీసులపైనా దాష్టీకం:**

టీడీపీ నాయకులు పోలీసులతోనూ దురుసుగా ప్రవర్తించారు. స్వయంగా డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డినే తోసేశారు. పోలీసు సిబ్బందిని సైడుకాలువలోకి తోసేశారు. లాగికొట్టారు. పోలీసుల సహనాన్ని పరీక్షిస్తూ ట్రంక్ రోడ్డు నుంచి లాయరు పేట వరకు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన కొందరు కార్యకర్తలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

– తర్లుపాడు మండలం కొత్తూరులో ఓ పాఠశాలను మూసేయించడానికి వెళ్లిన టీడీపీ నాయకులను తల్లిదండ్రులు నిలదీయగా వారితో దురుసుగా ప్రవర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

**తెరిచే ఉన్న హెరిటేజ్ డెయిరీ**

ముండ్లమూరు: నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా చేపట్టిన బంద్ నేపథ్యంలో టీడీపీ శ్రేణులు రోడ్లపై నిరసన తెలిపారు. దీంతో ప్రజలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. ఇదిలా ఉంటే ముండ్లమూరు మండలంలోని పులిపాడు వద్ద చంద్రబాబుకు చెందిన సంస్థ హెరిటేజ్ డెయిరీ మాత్రం యధావిధిగా పని చేసింది. ఎవరు ఎలా ఇబ్బంది పడినా హెరిటేజ్ మాత్రం లాభాపేక్ష కోసం పని చేసింది.

### బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ

ఒంగోలు టౌన్: అవినీతి కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఏసీబీ అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం ఎస్పీ మలికా గర్గ్ నగరంలోని ఆర్టీసీ బస్టాండు సెంటర్‌లో బందోబస్తును స్వయంగా పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. ప్రజలు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. నగరంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు తెలవారుజాము నుంచి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్నీ రహదారులు, ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లతో పాటుగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల రోజువారీ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు భక్తవత్సల రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఒంగోలు ఆర్టీసీ డిపో వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

### సుగంధ పంటలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా సుగంధ పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ప్రకాశం భవనంలో సుగంధ పంటలపై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ లెమన్‌గ్రాస్, పామరోజా, వట్టివేరు వంటి సుగంధ పంటలను ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఆర్థిక సహాయం అందించేలా చూడాలన్నారు. ప్రతి ఉద్యాన అధికారి కనీసం 100 ఎకరాలు తగ్గకుండా క్లస్టర్ మోడ్‌లో లక్ష్యం సాధించాలని ఆదేశించారు. దీనిలో ప్రాజెక్టు డైరెక్టర్ పీవీ రమణ, ఏపీఎంఐపీ జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, డ్వామా పీడీ శ్రీనారెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

మార్కాపురం: అవినీతి ఆరోపణల్లో మార్కాపురం పట్టణ ఎస్సై శశికుమార్, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ సోమవారం గుంటూరు ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. పల్నాడు జిల్లా దుర్గి మండలం చామరాజుపురంలో ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన అమ్మాయి ప్రేమ వ్యవహారంలో మార్కాపురం పోలీసుస్టేషన్‌లో అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు. పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం కింద కేసును నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడైన తనను తప్పించేందుకు సుమారు రూ. 2 లక్షలు మార్కాపురం పట్టణ పోలీసులు తీసుకొని మళ్లీ అరెస్టు చేశారని బాధితుడు మార్కాపురం డీఎస్పీతో పాటు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసు అధికారులు అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఐజీకి నివేదిక పంపటంతో పట్టణ ఎస్సై శశికుమార్, ఇద్దరు కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మౌలాలీలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా ఇటీవల కాలంలో మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రతి కేసుకు లంచం అడుగుతున్నారన్న ఫిర్యాదులు బాధితుల నుంచి వినిపించడంతో పాటు ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆరోపణలపైనే ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ కావడం చర్చనీయాంశమైంది. కాగా ఇటీవలే కొనకనమిట్ల ఎస్సై దీపిక లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

### గిద్దలూరులో రేపు ప్రత్యేక స్పందన

ఒంగోలు అర్బన్: సమస్యల పరిష్కారంలో భాగంగా జిల్లా యంత్రాంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గిద్దలూరులోని చీతిరాల వెంకటేశ్వర్లు కళ్యాణ మండపంలో ప్రత్యేక స్పందన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు స్పందనలో సమస్యలపై అర్జీలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా ఈ నెల 15వ తేదీ శుక్రవారం మార్కాపురం, 20వ తేదీ బుధవారం కనిగిరి, 22వ తేదీ శుక్రవారం దర్శి, 27వ తేదీ బుధవారం యర్రగొండపాలెం, 29వ తేదీ శుక్రవారం నాగులుప్పలపాడు మండలాల్లో ప్రత్యేక స్పందన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ స్పందనలో 136 అర్జీలు వచ్చాయి. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి అర్జీని కచ్చితంగా పరిష్కరించాలన్నారు. మొక్కుబడి పరిష్కారాలు కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సహేతుకంగా తిరిగి సమస్య పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. అప్పుడే అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. పరిష్కరించలేని సమస్యలుంటే వాటి కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు

- చీమకుర్తి మండలం పడమటి నాయుడుపాలేనికి చెందిన బూదాల సాయిబాబు స్పందనలో కలెక్టర్‌ను కలిసి తన కుమార్తె నాగదీప్తిక కంభం గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతోందని కుమార్తె ఆరోగ్యం సరిగా లేదని, చీమకుర్తి లేదా కొండపి గురుకుల పాఠశాలకు మారేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- ఒంగోలు నగరం ఇస్లాంపేటకు చెందిన పీ వెంకటేశ్వర్లు స్పందనలో అధికారులను కలిసి తనకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. తన వయసు 63 సంవత్సరాలని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే నగరపాలక సంస్థలో వివరాలు అడుగగా అసలు దరఖాస్తు లేదని చెప్పారని పరిశీలించి పింఛన్ ఇప్పించాలని కోరాడు.

# జైలు ఊచలు లెక్కబెడుతున్న గజదొంగ చంద్రబాబు

- యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లు దోపిడీ
- చంద్రబాబు అరెస్టుతో స్వర్గంలో ఉన్న ఆత్మలు శాంతిస్తున్నాయి
- కక్షసాధింపు కాదు కాబట్టే చంద్రబాబు అరెస్టుకు ఇంత కాలం పట్టింది
- పవన్ కళ్యాణ్ చిల్లర చేష్టలు మానుకోవాలి
- ఎంఎల్‌సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత

ఒంగోలు: గజదొంగ చంద్రబాబు అవినీతి, అక్రమాలకు పాల్పడడంలో స్కిల్ అని, యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లు కొల్లగొట్టి నేడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఊచలు లెక్కబెడుతున్నారని ఎంఎల్‌సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు విజనరీ అన్నారు. 2014–19 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కనీసం జీవోకాని, క్యాబినెట్ అప్రూవల్ కానీ లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం, స్టేలు తెచ్చుకుంటూ


విలేకర్లతో మాట్లాడుతున్న ఎంఎల్‌సీ సునీత

చట్టం నుంచి తప్పించుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, కానీ నేడు తొలిసారిగా ఆయనకు దేవుడు శిక్ష విధించాడన్నారు. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ ఆత్మ రాసిన స్క్రిప్ట్‌గా దీనిని భావిస్తున్నామన్నారు. 74 ఏళ్ల వయస్సులో రామారావుకు ఎలాంటి మానసిక క్షోభ పెట్టారో నేడు అదే వయస్సులో చంద్రబాబు జైలు ఊచలు లెక్కబెడుతూ ప్రజాగ్రహానికి గురయ్యారన్నారు. మరో వైపు చంద్రబాబు కొడుకు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు, పచ్చపత్రికలు జగనన్నపై ఏడుపులు, దుర్మార్గపు రాతలు రాస్తూ కక్షకట్టారనడం అవివేకం అన్నారు. రాజకీయ కక్షే అయి ఉంటే ఏనాడో చంద్రబాబు జైలు పాలు అయ్యేవారని, చట్టం తన పని తాను చేసుకుపోతోంది కాబట్టే ఇప్పటికి పాపం పండిందన్నారు. చంద్రబాబుకు 23 అంటే కలిసిరావడంలేదని, చివరకు చంద్రబాబుకు వచ్చిన ఖైదీ నంబర్ 7691 లోని అంకెల మొత్తం కూడా 23 రావడం గమనించాలన్నారు. చంద్రబాబు ఇప్పటి వరకు తాను సత్యహరిశ్చంద్రుని కన్నా గొప్పవాడ్నని, పెద్దనిప్పు అని చెప్పుకుంటుండేవారన్నారు. కానీ నేడు ఆయన ఎంతటి సత్యహరిశ్చంద్రుడో రాష్ట్రంలో ఆయనను అరెస్టుచేస్తే సంబరాలు చేసుకుంటున్న జనాన్ని చూస్తే అర్థం అవుతుందన్నారు. కనీసం పార్టీ నాయకులు కూడా రోడ్డుమీదకు రావడానికి వెనుకాడారు అని, అందుకు సాక్ష్యం అచ్చెన్నాయుడు ఆడియోనే అన్నారు. మరో వైపు పవన్ కళ్యాణ్ ఇదేదో సినీ సెట్టింగ్ అన్నట్లుగా రోడ్డు మీద కాలు మీద కాలు వేసుకుని పడుకోవడం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం అన్నారు. రాజకీయాల్లో పరిపక్వత ఉండాలి తప్ప చిల్లర రాజకీయాలు ఉండరాదని తెలుసుకోవాలన్నారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి శునకానందం పొందారని, నాడు జగన్‌మోహన్‌రెడ్డి తల్లి, చెల్లి, భార్య, బిడ్డలు ఎంతగా విలవిల్లాడారో గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఖర్మఫలం అనుభవించక తప్పదని, మనం ఏమి చేస్తామో భగవంతుడు కూడా మనకు అదే ఇస్తాడనేందుకు ఇదే నిదర్శనం అన్నారు. కేవలం ప్రచారం కోసం గోదావరి పుష్కరాలలో 23 మందిని పొట్టనబెట్టుకున్నారని, ఇటువంటి అనేక ఘటనలలో అశువులు బాసిన వారి ఆత్మలన్నీ నేడు రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును చూసి ఆత్మ సంతృప్తి చెందుతున్నాయని ఎంఎల్‌సీ పోతుల సునీత అన్నారు.

# స్కానింగ్ సెంటర్లపై పక్కా నిఘా

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్కానింగ్ సెంటర్లు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అనే అంశాన్ని విధిగా తనిఖీ చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో పీసీపీఎన్‌డీటీ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులతోపాటు రెన్యువల్ దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్ చట్టానికి సంబంధించిన నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని, ఆ మేరకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, రుసుముల వివరాలు ప్రజలకు కనిపించేలా బోర్డు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాల్లో ప్రతి రోజు నిర్వహించే పరీక్షల వివరాలను ఫాం-ఎఫ్ ద్వారా వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డాక్టర్లు నాగార్జున, సువర్ణరాజ్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, సరోజిని, ఇతర అధికారులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌ఓ, వైద్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

# తైక్వాండో పోటీల్లో సత్తా



తైక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులు

- 3 బంగారు, 2 వెండి, మూడు కాంస్య పతకాలు కైవసం

ఒంగోలు: దక్షిణ భారత 21వ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒంగోలు తైక్వాండో విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 8,9,10 తేదీల్లో విజయవాడలోని చెన్నుపాటి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలకు ఆంధ్రా, తెలంగాణా, ఒడిషా, తమిళనాడు రాష్ట్రాల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అత్యంత ఉత్కంఠగా జరిగిన పోటీలలో 3 బంగారు, రెండు వెండి, మూడు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అండర్ 13 విభాగంలో నిహాంత్(బంగారు), విజ్ఞాన్(వెండి), సాదాబ్, దేవ, షియాద్(కాంస్య)పతకాలు పొందారు. అండర్ 16 విభాగంలో ఎస్ఎంఎల్ శ్రీనివాస్(బంగారు) , వంశీ(వెండి), సాయికృష్ణ(కాంస్య)లు కైవసం చేసుకున్నారు. సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో మోటా ప్రశాంత్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన వారిని, అంతర్జాతీయ తైక్వాండో కోచ్ కరిముల్లా, ఎస్‌కె ఆరిఫ్‌లను ప్రపంచ తైక్వాండో గ్రాండ్ మాస్టర్ బీవీ రమణయ్య, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి, బొమ్మినేని మురళి, ఎస్ఎం బాషా, మద్రిపూడి చంద్రారావు తదితరులు అభినందించారు.

# వస్త్ర దుకాణ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- రూ.1.50 లక్షల ఆస్తి నష్టం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని దొడ్డావారి వీధిలో సోమవారం వేకువజామున 4.30 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సిల్కు, కాటన్ దుస్తులతో పాటు పరుపులు, దిండ్లలో ఉపయోగించే దూది కాలిపోయింది. మంటలు చెలరేగడాన్ని చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక శాఖాధికారి రామకృష్ణకు సమాచారం అందించడంతో ఆయన తన సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్ సాయంతో మంటలను అదుపు చేశారు. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

# త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


బస్‌ను బయటకు తీస్తున్న జేసీబీ

- రోడ్ మార్జిన్‌లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు
- ప్రయాణికులంతా సురక్షితం

దర్శి: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. దర్శి మండలంలోని రాజంపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనలో ప్రయాణికులు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కామాక్షి ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాద్ నుంచి పొదిలి వైపు ప్రయాణికులతో వెళ్తోంది. ఈ క్రమంలో రాజంపల్లి సమీపంలో రోడ్డు మార్జిన్ దిగి పంట పొలాల కాలువలోకి దూసుకెళ్లింది. అక్కడ ఉన్న చిల్ల చెట్లను ఢీకొని బస్సు ఆగింది. దీంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. బస్సు నిలిచిన ప్రదేశానికి సరిగ్గా రెండు అడుగుల దూరంలో విద్యుత్ స్తంభం ఉంది. స్తంభాన్ని బస్సు ఢీకొని ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈలోగా మరో బస్సులో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు తరలించారు. జేసీబీ సాయంతో బస్సును బయటకు తీశారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని కొందరు, ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి బస్సు మార్జిన్‌లోకి దూసుకెళ్లిందని మరి కొందరు చర్చించుకుంటున్నారు. ప్రమాదానికి గల కారణం తెలియలేదు కానీ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చేలోగా ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

# మహిళలకు ఆదాయ మార్గాలపై అవగాహన

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వ్యవసాయ భూములు ఉంటే వాటి నుంచి అదనపు ఆదాయం వచ్చేలా తగిన అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎఫ్‌పీజీ, ఎఫ్‌పీఓ ఏర్పాటుపై సోమవారం ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్ఆర్ఎల్ఎం కింద డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సంఘాల్లోని సభ్యులకు వ్యవసాయ భూములు ఉంటే ఎఫ్‌పీజీ, ఎఫ్‌పీఓల్లో భాగస్వాములను చేయాలన్నారు. వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానం గురించి అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి సాధించేలా చూడాలన్నారు. పంటల వారీగా వ్యవసాయ శాఖ రూపొందించిన రైతు గ్రూపుల వివరాలను కూడా డీఆర్‌డీఏకు అందజేయాలన్నారు. వారితో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి రికార్డుల నిర్వహణ, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, పొదుపు చేసుకునే మార్గాలపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఆత్మ పీడీ అన్నపూర్ణ, ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, నాబార్డు డీడీఎం రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామంలో ఓ వివాహిత అనుమానస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లె లావణ్య(40) తన ఇంట్లో జారి కిందపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ ఆమె తల, ముఖంపై కొట్టినట్లు గాయాలు ఉండటం అనుమానాలకు తావిస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు భర్త జయరాములును అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.


మృతి చెందిన లావణ్య

### కార్మిక శాఖాధికారుల తనిఖీలు


ఒంగోలులోని ఓ రెస్టారెంట్ వద్ద కార్మిక శాఖాధికారులు

ఒంగోలు టౌన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సోమవారం నెల్లూరు బస్టాండు సెంటర్లో కార్మిక శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆపరేషన్ స్వేచ్ఛ–3లో భాగంగా పలు దుకాణాలు, రెస్టారంట్లలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కార్మిక శాఖ సహాయ కమిషనర్ కె.కనకదుర్గ భవాని, సహాయ కార్మిక అధికారులు ఎం.ఎలిజబెత్, వెంకటేశ్వర్లు, డీసీపీఓ ఎం.భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

### అండర్-16 బాలుర ఫుట్‌బాల్ విజేత బాపట్ల

చీరాల రూరల్: బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నల్లమల జోనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్స్ అండర్-16 బాలుర ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్-2023 పోటీలు ఆదివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా ఫుట్‌బాల్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడా జట్లన్నింటిని వెనుకంజలో నిలిపి మెరుగైన ప్రతిభతో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలిపారు.

### 200 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

- ఒకరిపై కేసు నమోదు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్సై, సిబ్బంది

సీఎస్‌పురం (పామూరు): నాటుసారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని వి.బైలు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బెల్లంఊట నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి అక్కడ నిల్వ ఉంచిన బెల్లంఊటను ధ్వంసం చేసి ఘటనలో బాధ్యుడైన బద్దెల మాలకొండయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా, జూదం నిర్వహిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

### కుట్టు మిషన్‌తో జీవనోపాధి మెరుగు

- డీబీఆర్‌సీ రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత


మాట్లాడుతున్న డీబీఆర్‌సీ రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత

ముండ్లమూరు: మహిళలు కుట్టు మిషన్ ద్వారా జీవనోపాధి మెరుగుపరుచుకోవచ్చని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ హేమలత పేర్కొన్నారు. మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో జనశిక్షణ సంస్థ నేతృత్వంలో డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో మహిళలకు 3 నెలలపాటు నిర్వహించనున్న కుట్టు మిషన్ శిక్షణను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కుట్టుమిషన్ దోహదపడుతుందన్నారు. శిక్షణ ఉచితంగా ఇవ్వడంతోపాటు కుట్టుమిషన్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మండల కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, ట్రైనర్ ప్రసన్నకుమారి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

# 'మార్గదర్శిని' పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్ దిశానిర్దేశం

ఒంగోలు అర్బన్: మార్గదర్శిని కార్యక్రమాన్ని మరింత విస్తృత పరిధి పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో సోమవారం మార్గదర్శిని కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కలెక్టర్ గారి అతిథి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించినందున గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేకంగా మార్గదర్శిని సెల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థుల సంఘాలు, ఎన్ఆర్ఐలు కూడా చురుకైన పాత్ర పోషించేలా భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో రెగ్యులర్‌గా పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. డీఈఓ, డిప్యూటీ ఈఓలు, ఆర్‌ఐఓలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో మార్గదర్శిని నోడల్ అధికారి సామా సుబ్బారావు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డీఎస్‌డీఓ లోకనాథం, జిల్లా ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్